# చల్లగా ఉన్నపుడు..
# వేడి వేడిగా తింటే ఆ కిక్కే వేరు





వర్షం కురుస్తుంటే.. ఎవరికైనా సరే వేడి వేడిగా ఏదైనా తినాలి అనిపిస్తుంటుంది. వర్షా కాలం వానల్లో.. నూనెలో వేగి తీసిన రెసిపీస్ అబ్బా నోరు ఊరిస్తుంటాయి. చెప్తేనే నోట్లో నీళ్లు ఊరుతున్నాయి. కదా.. వాన పడుతుంటే అబ్బా కారం కారంగా ఏమైనా తిందామా? అని నాలుక లపలప లాడుతుంటుంది. వేడి వేడిగా ఘాటు ఘాటుగా ఉండే మిర్చి బజ్జీ, పానీ పూరీ, పకోడీ, సమోసాలు, చాట్ వంటి స్పైసీ ఫుడ్ ఉంటే ఆహా స్వర్గమే. మరి తింటే ఇంకెంత మజాగా ఉంటుందో కదా.. చక్కగా మసాలాలు దట్టించి ఎర్రటి కారం వేసి చేసి, వేడి వేడిగా స్పైసీగా నోట్లో పెట్టుకుంటే ఆ హాయి చెప్పడం ఎవరి వల్ల అవుతుంది కదా.. మరి జోరుగా వర్షా లు అయితే కురుస్తున్నాయి. మీ ఇంట్లో స్టవ్‌పై నూనె కాగుతుందా? అందులో ఏం వేయిస్తున్నారు? అయ్యో ఇంకా చదువుతూనే ఉన్నారా? అయితే పూర్తిగా చదివేసేయండి. ఆ తర్వాత ఈ స్పైసీ ఫుడ్‌లను తయారు చేసుకోండి. కారం, మసాలా ఘాటు బాగా పట్టించి చేస్తే.. అదదండి స్పైసీ అంటే.. శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల, స్పైసీ ఫుడ్ లో ఉండే కొన్ని ఆహార రసాయనాల వల్ల ఇలా స్పైసీ ఫుడ్ తినాలని అనిపిస్తుందట. వర్షా లు పడినప్పుడు, శీతాకాలంలో వాతావరణ చల్లగా మారిపోతుంది. అప్పుడు మసాలా ఆహారాన్ని తినాలన్న కోరిక శరీరంలో పుడుతుంది. స్పైసీ ఫుడ్‌లో క్యాప్సైసిన్ ఉంటుంది. ఇది శరీరంలో వెచ్చదనాన్ని కలిగించి వేడి పుట్టిస్తుంది. అందుకే మన శరీరంలో చల్లని వాతావరణంలో స్పైసీ ఫుడ్‌ను కోరుకుంటుంది.



## బజ్జీ, పకోడి, మిర్చీ బజ్జీ...

వర్షాకాలంలో స్పైసీ అంటే ఠక్కున గుర్తుకు వచ్చే ఐటం మిర్చీ బజ్జీ. బండి కనిపిస్తే చాలు కడుపులో బండి పరుగుతీ స్తుంది. చేతిలో ఉన్న బండికి బ్రేకులు పడుతాయి. ఓ ప్లేట్ గరం గరం బజ్జీ తినాలి అనిపిస్తుంది. మామ పదరా.. బజ్జీ లాగించేద్దాం అనాలి అనిపిస్తుంది. అదేనండి చల్లదనం పెరిగి వేడి కావాలి అనిపి స్తుంది. అందుకే మిర్చి బజ్జీపై బుజ్జి మనసు లాగుతుంటుంది. మిర పకాయల్లో క్యాప్సైసిన్ ఉంటుంది. మనం కారం తినగానే నోట్లోని నరాల గ్రాహకాలకు ఇది మనం ఏదో వేడి పదార్థం తిన్నామనే భావన కలగజేస్తుంది. దాంతో మెదడు మనకు చెమట పట్టేలా చేస్తుంది. మనలో ఆనందాన్ని పెంచే డోపమైన్ ను మన రక్తంలోకి విడుదల చేస్తుంది.



## పానీపూరి...

వామ్మో వరల్డ్ ఫేమస్ లవర్ లాగా ఈ రెసిపీ కూడా వరల్డ్ ఫేమస్ అయినట్టుగానే ఉందిగా.. వర్షంలో గొడుగులు పట్టుకొని మరీ సమోసా బండి దగ్గరికి వెళ్లాలి అనిపిస్తుంటుంది. వెళ్తుంటారు కూడా. ఓ ప్లేట్ అడగగానే మరొక్క ప్లేట్ తినాలి అనిపిస్తుంది. అయ్యో కట్లీస్ కూడా ఇందులో భాగమే.. మరి ఇంకేంటి తినేసేయండి. కానీ అతిసర్వత్రా వర్జయేత్.. గుర్తుందిగా..

## సమోసాలు...

సమోసాలు కూడా అంతే ఫుల్‌గా లాగించాలి అనిపిస్తుంది. సమోసాల లోపల మసాల కర్రీ కలిపి పెట్టిస్తుంటే.. ఆ వేడి వేడి సమోసా నాలుకపై ఆడుతుంటే.. ఆహా.. అనుభవించాల్సిందే..









## హాట్ కాన్...

స్వీట్ కాన్ వింటాం కానీ హాట్ కాన్ ఏంటి అనుకుంటున్నారా? అయితే అదే స్వీట్ కాన్ ని గానీ, మక్కలను గానీ కొన్ని అలా ఒలిచి, ముకుడులో వేసి కాస్త ఉప్పు, కారం, నూనె, నిమ్మకాయ రసం పిండి ఓ ఐదుని మిషాలు వేయించండి. వర్షంలో ఈ టేస్ట్ ఎలా ఉందో ఆ తర్వాత కామెంట్ చేయండి.. అదిరిపోలా అనిపిస్తుంది. మరి ఇంకెందుకు ఆలస్యం. కానిచ్చేయండి మై డియర ఫ్రెండ్స్.

## సర్వపిండి, గంజుపిండి...

ఇది ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో రాజ్యమేలుతుంది. కానీ రుచి మాత్రం అదుర్స్. ఇలా చల్లచల్ల వర్షంలో.. వేడి వేడి గంజు పిండి సూపర్‌గా ఉంటుంది. కారం, ఉప్పు, మసాలా కలిపి గంజుకు అలా పెట్టి ఉంచితే ఆ తర్వాత కాస్త మాడిన తర్వాత తింటే.. చాలు ఆ పూటకి అనిపిస్తుంది. ఇంకా ఏం అవసరం లేదు. హాయిగా నిద్ర పోవచ్చు రాత్రిళ్లు అనుకుంటారు ఈ గంజుపిండి లవర్స్.



# ఇంట్లో భోజనం చేసేటప్పుడు

# ఇవి ఫాలో అవుతున్నారా?

కాలం మారుతున్న కొద్దీ అలవాట్లు మారుతున్నాయి. గతంలో నేలపై కుటుంబ సభ్యులంతా కూర్చుని సామూహికంగా ఒకేసారి భోజనం చేసేవారు. రానురానూ ఆ అలవాటు తప్పుతూ వస్తోంది. ఎవరికి ఎప్పుడు ఆకలి వేస్తే అప్పుడు తింటున్నారు. అయితే తినేటప్పుడు మంచంపై లేదా డైనింగ్ టేబుల్ పై కూర్చొని తినడం అలవాటు చేసుకున్నారు. వాస్తవానికి తినేటప్పుడు ఎంతో ప్రశాంతంగా తినాలని చెబుతుంటారు. కానీ ప్రస్తుతం మొబైల్ ఫోన్ల ప్రభావం తీవ్రంగా పడటంతో భోజనం చేసేటప్పుడు కూడా మొబైల్స్ చూసుకుంటూ.. కంగారు కంగారుగా తింటున్నారు. ఇలా చేయడం వల్ల తిన్నది త్వరగా జీర్ణం కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తినేటప్పుడు ఇతర విషయాలపై దృష్టిపెట్టకుండా ప్రశాంత వాతావరణంలో భోజనం చేయాలని సూచిస్తున్నారు. మరోవైపు భారతీయ సంస్కృతిలో నేలపై కూర్చొని ఆహారం తినడం ఉత్తమంగా చెబుతారు. ఈ విషయం గ్రంథాలలో కూడా ఉంది. దీని వెనుక లోతైన శాస్త్రం దాగి ఉందని, నేలపై కూర్చొని తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. బిజీ జీవితాలతో ఎలా పడితే అలా తింటున్న వారు ఇవి తెలుసుకోవాల్సిందే...

**ఊబకాయం పెరగదు..**

నేలపై కూర్చొని తినడం వల్ల శరీరం చాలా నిటారుగా ఉంటుంది. దీని వల్ల ఆహారం తిన్నప్పుడు అది నేరుగా జీర్ణాశయం ద్వారా శరీరంలోని వివిధ భాగాలకు చేరుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. మొత్తం దృష్టి ఆహారంపైనే ఉంటుంది. తద్వారా మీరు అతిగా తినకుండా ఉంటారు. దీని వల్ల బరువు అదుపులో ఉండి ఊబకాయం రాదు.

**రక్త ప్రసరణ**

నేలపై కూర్చున్నప్పుడు శరీరంలోని రక్తనాళాలు సక్రమంగా పని చేస్తాయి, రక్త ప్రసరణ సక్రమంగా ఉంటుంది. ఆహారం వల్ల ఉత్పత్తి అయ్యే రక్తం ఈ గొట్టాల ద్వారా మీ తల నుంచి కాలి వరకు సులభంగా ప్రసరిస్తుంది.పైన భోజనం చేస్తున్నప్పుడు ఇది జరగదు.

**కుటుంబంలో సామరస్యం**

ఇంట్లో అందరూ కలిసి నేలపై కూర్చొని భోజనం చేస్తే కుటుంబంలో ప్రేమ పెరుగుతుంది. దీంతోపాటు ఆహారం వృథా కాదు. తినే ఆహారం విలువ తెలుస్తుంది. ఇది పాత తరం నుంచి తరువాతి తరానికి అందిస్తున్న సంస్కృతి. తినేటప్పుడు

**ఎసిడిటీ, గ్యాస్‌కి చెక్**

నేలపై కూర్చొని భోజనం చేయడం ద్వారా శరీరంలోని జీర్ణవ్యవస్థకు మంచిదని చెబుతారు. ఇలా చేయడం వల్ల ఎసిడిటీ, గ్యాస్ ఏర్పడే సమస్య ఉండదు. దీంతో పాటు ఎముకల బలహీనత, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మీరు రోజూ ఉదయం, సాయంత్రం నేలపై కూర్చొని ఆహారం తీసుకుంటే మీ మోకాళ్లకు వ్యాయామం జరుగుతుంది. అవి మీ శరీర బరువును ఎక్కువసేపు భరించగలవు.

**జీర్ణవ్యవస్థకు మేలు..**

కింద కూర్చున్నప్పుడు మీరు ముందుకు వంగి ఆహారం తీసుకొని ఆపై నిటారుగా ఉన్న భంగిమలో రావాలి. ఇలా చేయడం ద్వారా మీరు తిన్న ఆహారం అలిమెంటరీ కెనాల్ ద్వారా నేరుగా జీర్ణవ్యవస్థకు చేరుతుంది. దీని వల్ల కడుపునొప్పి, అజీర్ణం వంటి సమస్యల నుంచి బయటపడతారు. దీనివల్ల వెన్నెముక ఫిట్‌గా ఉంటుంది.





# వర్షాకాలం అలర్జీలకు ఈ జాగ్రత్తలతో చెక్!

ఎక్కువ మంది ఇష్టపడే సీజన్లలో వర్షాకాలం టాప్ ప్లేస్ లో ఉంటుంది. వర్షాకాలం వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వర్షాల్లో తడవడమంటే ఎంతో మందికి ఇష్టం. కాకపోతే ఇక్కడే ఓ సమస్య ఉంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తుంది. ఈ వర్షాకాలంలో స్కిన్ ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువ ఉందని నిపుణులు చెబుతున్నారు. వర్షం సమయంలో వాతావరణంలో తేమ పెరుగుతుంది. దీంతో ఇది చర్మంపై బ్యాక్టీరియా, ఫంగస్ పెరగడానికి కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా, ఫంగస్ కారణంగా, మన చర్మం తడిగా ఉన్నా, బట్టలు తడిగా ఉన్నా చర్మ వ్యాధులు రావడం గ్యారంటీ. ఇది కాకుండా, కొంతమందికి వర్షాకాలంలో ఎక్కువ చెమట కూడా పడుతుంది. దీని వల్ల చర్మంపై తేమ, మురికి పేరుకుపోతుంది. ఇది స్కిన్ ఇన్ఫెక్షన్ వృద్ధి చెందడానికి అవకాశం ఇస్తుంది. దీని వల్ల వ్యాధులు వస్తాయి. ఈ సీజన్‌లో ఏయే చర్మవ్యాధులు ముప్పు పొంచి ఉన్నాయో నిపుణుల ద్వారా తెలుసుకుందాం.

**అథ్లెట్స్ ఫుట్ ఇన్‌ఫెక్షన్**

వర్షాకాలంలో అథ్లెట్స్ ఫుట్ ఇన్ఫెక్షన్ రావచ్చు. అథ్లెట్స్ ఫుట్ అనేది పాదాలలో వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్. ఇది ముఖ్యంగా వేళ్ల మధ్య జరుగుతుంది. పాదాలు ఎక్కువసేపు తడిగా ఉన్నప్పుడు ఈ ఇన్ఫెక్షన్ వస్తుంది. వర్షాకాలంలో, ప్రజలు వర్షంలో తడిసి, ఎక్కువసేపు తడిగా ఉన్నప్పుడు, ఈ ఇన్ఫెక్షన్ వేగంగా వ్యాపిస్తుంది. ఇది పాదాల చర్మంపై దురద, మంటను కలిగిస్తుంది. వేళ్ల మధ్య పొక్కులు రావడం, పాదాల నుంచి దుర్వాసన రావడం వంటి లక్షణాలు ఉంటాయి.

**ఫంగల్ ఇన్ఫెక్షన్:**

ఫంగల్ ఇన్ఫెక్షన్ చర్మంపై ఎరుపు, దురద మచ్చలను కలిగిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ శరీరంలోని ఏ భాగానైనా వస్తుంది. దీనిని రింగ్ వార్మ్ అని కూడా అంటారు. దీని కారణంగా, చర్మంపై వృత్తాకార మచ్చలు కనిపిస్తాయి, ఇవి నెమ్మదిగా పెరుగుతాయి. ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి కూడా రావచ్చు. వర్షాకాలంలో తడి, మురికి బట్టలు ధరించడం వల్ల ప్రమాదం పెరుగుతుంది.

**ఈస్ట్ సంక్రమణ:**

ఈస్ట్ ఇన్ఫెక్షన్ అనేది ఫంగల్ ఇన్ఫెక్షన్. ఇది సాధారణంగా తేమ ఉన్న ప్రదేశాల్లో, చంకలు, గజ్జలు, మహిళల ప్రైవేట్ భాగాలలో సంభవిస్తుంది. వర్షాకాలంలో తేమశాతం పెరగడం వల్ల ఈ ఇన్ఫెక్షన్ ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈస్ట్ ఇన్ఫెక్షన్ ప్రభావిత ప్రాంతంలో దురద, మంట కలిగిస్తుంది.

## రక్షించుకోవడం ఎలా?

- తడిగా ఉన్న షూస్ ధరించవద్దు
- హెయిర్‌బ్రష్‌లు, సాక్స్‌లు లేదా టవల్స్ ఒకరివొకరు వాడొద్దు
- రోజు శుభ్రమైన సాక్స్ ధరించాలి
- తల స్నానం తర్వాత బాగా ఆరబెట్టాలి
- వదులైన దుస్తులు ధరించాలి
- ఎక్కువ సేపు నీటిలో ఉండరాదు
- తడిగా ఉన్న దుస్తులు ధరించవద్దు
- వర్షంలో తడిస్తే వెంటనే పొడి వస్త్రంతో తుడుచుకోవాలి
- లో దుస్తులు తప్పనిసరిగా శుభ్రంగా ఉంచుకోవాలి



# జన నాయగన్ సినిమాలో ఆ 'టెక్నీషియన్‌ను మార్చాలన్న' దళపతి విజయ్..

తమిళనాడు సీఎం, స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన ప్రతిష్టాత్మక పొలిటికల్, యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జననాయగన్ (తెలుగులో జన నాయకుడు). విజయ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించి, సీఎం అయిన తర్వాత రిలీజ్ అవుతున్న ఫస్ట్ సినిమా కావడంతో దీనిపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎన్నో సెన్సార్ వివాదాలు, అడ్డంకులను అధిగమించి ఈ చిత్రం జూలై 23, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ సినిమానే ఆయన చివరి సినిమాగా ప్రచారం అవుతుండటంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర నిర్మాత వెంకట్ కె. నారాయణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

నిర్మాత వెంకట్ కె.నారాయణ మాట్లాడుతూ.. ఈ సినిమా నిర్మాణ సమయంలో జరిగిన ఆసక్తికర సంఘటనను పంచుకున్నారు. ఒక సందర్భంలో దళపతి విజయ్ తనకు ఫోన్ చేసి జన నాయగన్ సినిమా కోసం పనిచేస్తున్న ఓ టెక్నీషియన్‌ను మార్చాలని సూచించారన్నారు. అయితే వెంటనే మరో ప్రశ్న కూడా అడిగారని వెల్లడించారు. "ఆ టెక్నీషియన్‌ను మార్చితే మీకు (నిర్మాతకు) ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉంటుందా?" అని విజయ్ అడిగారని తెలిపారు. దీనికి తాను "అవును సర్.. కొంత ఫైనాన్షియల్ ఎఫెక్ట్ ఉంటుంది. అయినా నేను మేనేజ్ చేస్తాను" అని సమాధానం ఇచ్చానన్నారు. అయితే నా సమాధానం విన్న వెంటనే విజయ్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారని వెంకట్ కె. నారాయణ వెల్లడించారు. నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ఆ టెక్నీషియన్‌ను మార్చకుండా కొనసాగించాలని నిర్ణయించారని చెప్పారు. ఈ ఘటన విజయ్ నిర్మాతల పట్ల ఎంత గౌరవం, బాధ్యతతో వ్యవహరిస్తారో చెప్పే ఉదాహరణ అని వెంకట్ కె. నారాయణ వ్యాఖ్యానించారు. సినిమా నిర్మాణంలో నిర్మాత పెట్టే పెట్టుబడి, ఎదుర్కొనే రిస్క్‌ను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకునే హీరోలు చాలా అరుదుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# దక్షిణాది నుంచే ఆ క్రమశిక్షణ అలవాటు

'భాష నాకు అడ్డంకి కాదు కానీ.. ప్రాధాన్యతలేని పాత్రల్లో నటించే అవకాశాలు వచ్చినప్పుడు వాటిని అంగీకరించడం ఎందుకు' అంటోంది అగ్రకథానాయిక కాజల్. బాలీవుడ్‌లో అగ్రతారల సరసన పలు చిత్రాల్లో మెరిసిన ఈ తార తాజాగా హిందీ సినిమాల్లో నటించే అవకాశాలొచ్చినా అంగీకరించకపోవడానికి గల కారణాల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. ''దక్షిణాది చిత్రపరిశ్రమలో హీరోయిన్ పాత్రల్లో ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎంతో మార్పు వచ్చింది. ఇప్పుడు వారు తెరపై నటీమణులకు శక్తిమంతమైన పాత్రలు రాస్తున్నారు. నాకు అక్కడ లభిస్తున్న ప్రాధాన్యత కలిగిన పాత్రలు బాలీవుడ్‌లో లభించడం లేదు. నా దృష్టిలో ఎన్ని చిత్రాలు చేశాను అనే దానికంటే ప్రాధాన్యతగల పాత్రలకే ఎక్కువ విలువ ఇస్తాను. అలాంటి పాత్రలు దక్షిణాదిలో నాకు కావాల్సినన్ని దక్కుతున్నాయి. కాబట్టి హిందీలో ప్రాధాన్యత లేని పాత్రలు నేనెందుకు చేయాలి. భాష నాకు ఎప్పుడూ అడ్డు రాలేదు. బాలీవుడ్ సెట్స్‌లో ఏదీ సమయానికి జరగదు. కానీ దక్షిణాది చిత్రసీమలో ఇలాంటి ధోరణి ఉండదు. ఇక్కడ అన్నీ సమయానికి జరిగిపోతాయి. సెట్‌కి సమయానికి రావడం లాంటివన్నీ దక్షిణాది సినిమాల్లో నేర్చుకున్న క్రమశిక్షణే. దానికి బాగా అలవాటు పడిపోయాన''ని చెప్పుకొచ్చింది. కాజల్ త్వరలో 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది.





# నా అభిమానులు ఎస్‌కేఎన్, సాయి రాజేష్‌లను చూసి గర్వపడుతున్నా..

'చెన్నై లవ్ స్టోరీ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన ప్రసంగం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా టీమ్‌ను అభినందించడమే కాకుండా, తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "చెన్నై లవ్ స్టోరీ" అనే టైటిల్ వినగానే తనకు చెన్నై నగరంతో ఉన్న అనుబంధం గుర్తొచ్చిందని చెప్పారు. నటుడిగా ఎదగాలనే కలతో చెన్నై వీధుల్లో తిరిగిన రోజుల నుంచి, స్టార్ హీరోగా అదే నగరంలో ప్రయాణించిన క్షణాలు తన జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమానికి రావడానికి ప్రధాన కారణం ఇక్కడ ఉన్న యువ ప్రతిభ అని చిరంజీవి పేర్కొన్నారు. నిర్మాత ఎస్‌కేఎన్, దర్శకుడు సాయి రాజేష్, దర్శకుడు రవి వర్మ వంటి వారు తన అభిమానులుగా ఇండస్ట్రీలోకి వచ్చి తమ ప్రతిభతో ఎదగడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అభిమానులు కేవలం ప్రేమ చూపించడం మాత్రమే కాదు, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుని తమ తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగడమే నిజమైన అభిమానమని తెలిపారు.

ఎస్‌కేఎన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడిన చిరంజీవి, ఒక ఫ్యాన్‌బాయ్‌గా ప్రారంభమైన ప్రయాణం నేడు విజయవంతమైన నిర్మాత స్థాయికి చేరుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే సాయి రాజేష్ రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా ఎదిగి జాతీయ అవార్డులు అందుకోవడం తనకు గర్వకారణమని కొనియాడారు. యువతకు చిరంజీవి కీలక సందేశం ఇచ్చారు. "కలలు కనండి... కానీ రాత్రిపూట కాదు, పగలే కనండి. ఆ కలలను నిజం చేయడానికి కష్టపడండి. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రండి. అవమానాలు, అపజయాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగితే విజయం తప్పకుండా వస్తుంది" అని సూచించారు.

# ప్రియాంక చోప్రా బాలీవుడ్‌కు గుడ్‌బై చెప్పడానికి వాళ్లే కారణమట

గ్లోబల్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తన కెరీర్‌లో ఎదురైన కొన్ని చేదు అనుభవాలను తాజాగా పంచుకున్నారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న సమయంలో ఆమె హిందీ చిత్ర పరిశ్రమకు దూరమై హాలీవుడ్ వైపు వెళ్లడం అప్పట్లో పెద్ద చర్చగా మారింది. అయితే బాలీవుడ్‌ను ఎందుకు వదిలారనే విషయంపై ప్రియాంక తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు నచ్చని వ్యక్తులకు అనుగుణంగా మారకపోవడం, వారు చెప్పిన విధంగా నడుచుకోకపోవడం వల్ల కొన్ని సినిమా అవకాశాలు తన నుంచి దూరమయ్యాయని ప్రియాంక వెల్లడించారు. ఇతరులు రాజీ పడిన విధంగా తాను కూడా రాజీపడాలని అనుకోలేదని, తన ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇచ్చానని చెప్పారు. కొంతమంది అగ్ర హీరోలు తనను ఉద్దేశపూర్వకంగా కొన్ని సినిమాల నుంచి తప్పించారని ప్రియాంక ఆరోపించారు.

2007లో 'సలామ్-ఎ-ఇష్క్' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఓ సంఘటనను ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ టైంలో తాను మరో సినిమాలో నటించేందుకు సిద్ధమవుతున్న అప్పుడు ఆ సినిమా హీరో తనను కలిసేందుకు షూటింగ్ సెట్‌కు వచ్చారు. తనకు మద్దతుగా వచ్చారని భావించినప్పటికీ, ఆ హీరో చెప్పిన మాటలు ఆశ్చర్యానికి గురిచేశాయని ప్రియాంక చెప్పారు. "ఈ పాత్ర వాస్తవానికి మరో హీరోయిన్ కోసం అనుకున్నారు. పొరపాటున ఈ సినిమా మీకు వచ్చింది. భవిష్యత్తులో మనం మరో సినిమా చేద్దాం" అని చెప్పినట్లు ఆమె వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు ఒక్కసారి మాత్రమే కాకుండా పలుమార్లు ఎదురయ్యాయని, ఆ సమయంలో తన కెరీర్‌పై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నానని ప్రియాంక తెలిపారు. తన నటన, కష్టమే తనను ముందుకు తీసుకెళ్లాయని, మరిన్ని అవకాశాలను అందించాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S